ఈనాడు
THE HEART AND SOUL OF ANDHRA PRADESH
Saturday , October 7, 2006

# అమెరికన్ పాఠశాలల్లో హిందీ పాఠాలు




యూలెస్: హర్స్ట్ యూలెస్ బెడ్‌ఫోర్డ్(హెచ్.ఈ.బి.) స్కూల్స్‌లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి హిందీ భాషను ప్రవేశపెడుతున్నట్లు ఆ సంస్థ సూపరింటెండెంట్ డాక్టర్ జీన్ బ్యూస్గర్ తెలిపారు. అక్టోబర్ 4న యూలెస్ నగరంలోని ప్యాట్ మే హాల్‌లో హచ్.ఈ.బి., భారత్ అమెరికా మైత్రి మండలి సంయుక్తంగా ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాయి. హెచ్.ఈ.బి. స్కూల్స్‌లో హిందీ భాషను ప్రవేశపెడుతున్నట్లు ఈ కార్యక్రమంలో వెల్లడించారు. అమెరికాలోని పాఠశాలల్లో హిందీ భాషను ప్రవేశపెట్టిన వాటిలో హెచ్.ఈ.బి. స్కూల్ రెండవది. ఉన్నత స్థాయిలో కొన్ని యూనివర్సిటీల్లో హిందీ భాష ఇప్పటికే ఉంది.

హిందీ భాష ప్రాముఖ్యాన్ని గుర్తించి వచ్చే విద్యా సంవత్సరం నుంచి హిందీని ఓ సబ్జెక్ట్‌గా ప్రారంభించడానికి కృషి చేసినందుకుగాను హెచ్.ఈ.బి. సూపరింటెండెంట్ జీన్ బ్యూస్గర్‌కు ప్రసాద్ తోటకూర కృతజ్ఞతలు తెలిపారు. "హెచ్.ఈ.బి.స్కూల్స్‌తో పాటు అమెరికాలోని ఇతర పాఠశాలల్లో హిందీని ప్రచారం చేయడం ద్వారా అన్ని వర్గాల్లో మైత్రిని పెంపొందించడానికి భారత్ అమెరికా మైత్రీ మండలి కృషి చేస్తుంది" అని ప్రసాద్ తోటకూర చెప్పారు. "అమెరికాలో భారత్ జనాభా ప్రస్తుతం 2.32 మిలియన్లు. అమెరికాలో నివసిస్తున్న వారిలో ఆసియా ఖండం నుంచి భారత్‌ది రెండో స్థానం. బుష్ ప్రభుత్వం హిందీని ప్రపంచంలోని ఆరు ప్రధాన భాషల్లో ఒకటిగా గుర్తించింది. భద్రత అవసరాల దృష్ట్యా అమెరికన్లు హిందీని నేర్చుకోవల్సిన అవసరం ఉందని నిర్ణయించినట్లు" ప్రసాద్ తోటకూర తన ప్రసంగంలో పేర్కొన్నారు.

హెచ్.ఈ.బి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏడు, ఎనిమిదవ తరగతుల విద్యార్థులకు హిందీ, చైనీస్ భాషల్లో తరగతులు నిర్వహిస్తుంది. అర్హతను బట్టి హెచ్.ఈ.బి. ఐ.ఎస్.డికి చెందని విద్యారులు కూడా అంతర్జాతీయ బిజినెస్ విభాగంలో చదవడానికి అవకాశం ఉంటుంద.

"అంతర్జాతీయ బిజినెస్ విభాగంలోని విద్యార్థులు ద్వితీయ భాషలో ప్రావీణ్యం సంపాదించడం అవసరం. ద్వితీయ భాషను రాయడం, చదవడం, మాట్లాడడం వస్తేనే అంతర్జాతీయ బిజినెస్ ప్రమాణాలకు చేరుకుంటారు. అందువలన హిందీని ద్వితీయ భాషగా స్వీకరించేవారికి లాభం చేకూరుతుంది" అని హెచ్.ఈ.బి. సూపరింటెండెంట్ జీన్ బ్యూస్గర్ పేర్కొన్నారు.